క్లుప్తంగా

కొనసాగుతున్న రథోత్సవం

వరంగల్ చౌరస్తా : గోవిందరాజుల స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం రెండో రోజు రథోత్సవ కార్యక్రమం కొనసాగుతోంది. దుర్గేశ్వర స్వామి ఆలయం, రాధిక థియేటర్ నుంచి పిన్నావారి వీధి, రాముల వారి కోవెల మీదుగా సత్య ఆస్పత్రి వరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు మంగళ హారతులతో ఎదురెగారు. రథోత్సవంలో ఆలయ ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాసా స్వామి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, నాయకులు అనిల్‌కుమార్, ఆది నారాయణ, క్రాంతి, వేణు, అర్చకులు జగన్నాథం, వేణు స్వామి, కిరణ్ స్వామి పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు ఇవ్వాలి

న్యూశాయంపేట: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వంట కార్మికులకు రూ.10 వేల వేతనాన్ని ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అమలు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ బిల్లులు సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు.

నూతన కమిటీ సరైందికాదు

కాజీపేట రూరల్: ఇటీవల నియమించిన గంగపుత్ర సంఘం నగర కమిటీ సరైందికాదని కాజీపేట గంగపుత్ర (బెస్త) సంఘం కమిటీ సభ్యులు కొదిరిపాక వేదప్రకాష్, అనుమాల శ్రీనివాస్, డి.శంకర్, బి.రవీందర్ తెలిపారు. కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు.

పండ్ల పంపిణీ

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని సహృదయ అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు హనుమాన్ మాలధారుడు కోరుట్ల రమేష్, స్రవంతి దంపతులు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో వారు ఆత్మీయంగా గడిపి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు ఎండీ.యాకూబీ, చోటుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల హవా



ఎం.పావని | సాత్విక | అక్షయ | ఎస్.ప్రత్యూష | పూజిత | పావని | రక్షిత్ | కె.స్వామి | మాడిశెట్టి గణపతి | యు.చందు

- ప్రతిభ కనబర్చిన గురుకుల, మోడల్, కేజీబీవీ, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు
- అభినందించిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో వివిధ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేజీబీవీ, గురుకుల, ఎంజేపీ, టీఎస్ఆర్‌జేసీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి టాపర్‌లుగా నిలిచారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు. మొదటి సంవత్సరంలో 77మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే సెంకండీయర్‌లో 76మందికి 76మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. సెకండియర్ ఫలితాల్లో ఐ.ప్రవళిక (బైపీసీ) 950 మార్కులు సాధించగా, సీహెచ్.సుస్మిత (బైపీసీ) 922 మార్కులు, జే.వర్షిక (ఎంపీసీ) 948, బి.సిందూజ 944 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో బి.కిరణ్మయి (ఎంపీసీ) 465, ఎస్.శ్రీవిద్య (ఎంపీసీ) 464, బైపీసీలో ఈ.సువర్చన 422, ఆర్.అక్షర 416 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.

ఆదర్శ పాఠశాలలో..

మోడల్ స్కూల్‌ల్లో ఫస్టియర్ (ఎంపీసీ)లో 29మంది విద్యార్థులకు గాను వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బయ్యా సునీత తెలిపారు. బైపీసీలో 12మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. సీఈసీలో 21మందికి 13మంది ఉత్తీర్ణత సాధించారని, సెకండియర్ ఎంపీసీలో 30మందికి 30మంది ఉత్తీర్ణత, బైపీసీలో 28మందికి 27మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సీఈసీలో 23మందికి 20మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. మొదటి సంవత్సరంలో గొట్టం పూజ-437, గ్యాదరబోయిన కీర్తన-416, భాషబోయిన మనోగ్న-388 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే సెకండియర్‌లో పులి లక్ష్మి (ఎంపీసీ)907, అజ్మీరా రాగవి (బైపీసీ) 916, ఎల్తూరి రోహిత్ (సీఈసీ) 955 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

భీమదేవరపల్లిలో..

భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని మోడల్ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులతో జిల్లాస్థాయిలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పులి పూజిత (బీపీసీ)ఫస్టియర్ 431, పి.పూజ 416, (ఎంపీసీ), కె.మైత్రి 451 సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. సెకండియర్‌లో టి.శ్రీలేఖ(ఎంపీసీ) 960, ఎండీ అతియా(బైపీసీ) 955 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్ల వెల్లడించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు శాలువా కప్పి అభినందించారు. అలాగే కేజీబీవీ బాలికల కళాశాల విద్యార్థిని స్వాతి (ప్రథమ సంవత్సరం)449, జీ.శ్రీజ 432, సౌజన్య 423, సీహెచ్.నవ్య 413 సాధించినట్లు తెలిపారు. ద్వీతీయ సంవత్సరంలో సీహెచ్. శ్రీవల్లి (ఎంపీసీ) 964, ఎం.కావ్య 933, బి.ఉషారాణి 933, జి.కీర్తన 948, ఎస్.శ్రీజ 916 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు బుధవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.పావని 467/470 మార్కులు, ఎం.సంజన 445/470 మార్కులు సాధించారు. బైపీసీలో బి.కీర్తన 409/440, డి.కావ్య 398/440 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో పి.శ్రావణి 955/1000, టి.పావని 948/1000, ఎంపీసీలో కె.నందిని 903/1000, ఎస్.సైనీ 818/1000 మార్కులు సాధించారు. ఎంజేపీ బాలుర గురుకుల కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో యు.చందు 466, సీఈసీలో ఎ.శివశంకర వరప్రసాద్ 448, హెచ్ఈసీలో కె.ప్రణయ్ 416, బైపీసీలో కె.ప్రవీణ్ 414 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో మాడిశెట్టి గణపతి 961, సీఈసీలో కూనూరు స్వామి 960, ఎంపీసీలో భూక్య రాహుల్ 941, హెచ్ఈసీలో కె.దేవేందర్ 830 మార్కులు సాధించారు. ఎంజేపీ బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో కోల గాయత్రి 462/470, బైపీసీలో కెంచె జ్యోతి 434/440, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో పిడుగు రమ్యశ్రీ 974/1000, బైపీసీలో ఏకు బిందు 935/1000 మార్కులు సాధించారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో పి.హర్షిత 449/470, బైపీసీలో జి.రవళి 410/440, సీఈసీలో టి.అక్షయ 407 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సీహెచ్.శృతిక, జి.శ్రీకృతి 965/1000, ఎస్.స్రవంతి 946 మార్కులు, బైపీసీలో జి.సృజన 926, ఇ.వైష్ణవి 904 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో తుమ్మ ప్రణయ్ 408 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపీసీలో తంగళ్లపల్లి అశ్విత, శనిగరపు అక్షయ 662 మార్కులు సాధించారు. ఇంటర్మీడియేట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ అభినందించారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని మందారిపేట కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల విద్యార్థులు బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ఇంటర్ సెకండియర్ బైపీసీలో వైష్ణవి 955, కావ్య 919, ఎంపీసీలో ఆర్.అనూష 915, టి.స్పందన 914 మార్కులు సాధించారు. ఫస్టియర్ బైపీసీలో ఎస్.ప్రత్యూష 420, వి.రజిని 396, ఎంపీసీలో గీతాంజలి 418, హర్షిత 416 మార్కులు సాధించారు. విద్యార్థినులను కళాశాల స్పెషల్ ఆఫీసర్ మాధవి అభినందించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఆర్.లావణ్య 874, టి.రాజ్‌కుమార్ 634, కే.శివాని 614 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో ఎండీ.యాసిన్ 341, వి.ప్రవళిక 334 మార్కులు సాధించారు. ప్రిన్సిపాల్ శ్రీధర్ అభినందించారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : ఇంటర్ ఫలితాల్లో మండలంలోని గుడెప్పాడ్‌లో కొనసాగుతున్న పెద్దాపూర్ ఎంజేపీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరంలో 55 మందికి 44 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 51 మందికి 38 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ సెకండ్ ఇయర్ విద్యార్థిని ఏ.పావని 939 మార్కులు సాధించింది. బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో సాత్విక 437 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ స్టెల్లా తెలిపారు. అలాగే కేజీబీవీలో బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో వర్షిత 427, స్ఫూర్తి 420, బైపీసీ సెకండ్ ఇయర్‌లో స్పందన 945, సుస్మిత 927, ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో పూజిత 445, ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో వెన్నెల 939 మార్కులు సాధించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ ప్రథమ సంవత్సరంలో బయగాని వర్షిణి 424, సెకండ్ ఇయర్ సీఈసీలో షారుఖ్ అరాఫత్ 873 మార్కులు సాధించారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్మీయట్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్.నర్మద 431/440 మార్కులు సాధించింది. హనుమకొండ నారాయణ కాలేజీలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న వెంకటాపురం గ్రామానికి చెందిన శంభపల్లి రక్షిత్ 465/470 మార్కులు సాధించాడు. హైదరాబాదలోని శ్రీచైతన్యలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న పున్నేలు గ్రామానికి చెందిన అడ్డగట్ల సరయూ 435/440 మార్కులు సాధించింది. హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కాలేజీలో బైపీసీ చదువుతున్న మండల కేంద్రానికి చెందిన బొల్లెపల్లి అక్షయ 986/1000 మార్కులు సాధించింది. హనుమకొండలోని శ్రీవికాస్ కాలేజీలో ఎంపీసీ చదువుతున్న మండల కేంద్రానికి చెందిన బొల్లెపల్లి బిందు 976/1000 మార్కులు సాధించింది.

పరకాలలో..

పరకాల : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని ఎస్వీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో ఒంటేరు నవీనరాణి 432 మార్కులు, ఎంపీసీలో గాజర్ల శివశంకర వరప్రసాద్ 424 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదే విధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో గోనెల రచన 805 మార్కులు, బైపీసీలో మహ్మద్ సమీర్ 797 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

వేలేరులో..

వేలేరు : ఇంటర్ ఫలితాల్లో టీఎస్ఆర్‌జేసీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సెకండియర్ ఎంపీసీలో గనిపాక స్వస్తిక్ 978 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. బైపీసీలో వరుణ్‌తేజ 971 మార్కులు సాధించాడు. బైపీసీ విభాగంలో రాహుల్ 430 మార్కులు సాధించాడు. గురుకుల కళాశాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ తెలిపారు. అలాగే కేజీబీవీలో విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఎస్‌ఓ స్రవంతి తెలిపారు. బైపీసీ సెకండియర్‌లో సుధావాణి 893 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచినట్లు కళాశాల ఎస్‌ఓ తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



నడికూడ : మండలంలో తాగునీటి ఎద్దడి తలేత్తకుండా చూడాలని డీపీఓ లక్ష్మీరామకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని వరికోల్ గ్రామంలో ఎంపీఓ సయ్యద్ అఫ్జల్‌తో కలిసి సందర్శించారు. తాగునీటి సరఫరాపై ఆరాతీశారు. అనంతరం నర్సరీని పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నియామకం

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటకు చెందిన ఊగ సాయికృష్ణను బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తూ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ఆత్మకూరు మండల అధ్యక్షుడు రాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీలో చేరికలు



ధర్మసాగర్ : మండలంలోని ఎల్కుర్తి, ధర్మపురం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. ఈ మేరకు బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ కండువా కప్పి ఆహ్వానించారు. మందుగుల లింగాచారి, మల్లికార్జున్, నరిశెట్టి సదానందం, రాకేష్, కుమార్, సదానందం, కొమురయ్య, కరుణాకర్, కృష్ణ, వినయ్, రఘు, రాకేష్, మణికంఠ, దిలీప్, రాజు, వెంకటయ్య, సంతోష్ తదితరులు చేరిన వారిలో ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామంలో ఓడీసీఎమ్మార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఓడీసీఎమ్మార్ ఏజెంట్ రమాదేవి ప్రారంభించారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు.

పశువులకు మేతగా పంటపొలాలు

- అడుగంటిన భూగర్భ జలాలు
- కాల్వల్లో కనిపించని నీటి చుక్క
- కళ్లముందే పంటలు ఎండుతుంటే ఘొల్లుమంటుతున్న రైతులు



శాయంపేట : ఎండిపోయిన పొలంలో పశువులను మేపుతున్న రైతులు



శాయంపేట : వసంతాపూర్‌లో ఎండిపోయిన మొద్దుల చెరువు

దామెర : రైతన్నలకు ఎటుచూసినా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. రబీ సీజన్‌లో ఎన్నో ఆశలతో మొక్కజొన్న, వరి సాగు చేస్తే నీరు అందకపోవడంతో పొంటపొలాలు ఎండిపోయి పశువుల మేతగా మారాయి. పంటలకు నీరందించని దీనస్థితిలో ఉన్న రైతులకు కళ్లముందే పంటలు ఎండుతుంటే ఘొల్లుమంటున్నారు. దామెర మండల వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో ఎక్కువ మంది రైతులు వరి, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. గతేడాది మాదిరిగా సమృద్ధిగా నీరందించి అధిక దిగుబడి పొందాలనే ఆశతో రైతన్నలు పొద్దుమాపు తేడా లేకుండా కష్టపడ్డారు. కానీ గత రెండు నెలల నుంచి ఉష్ణోగ్రతలు పెరగడంతో కుంటలు ఎండిపోయి, బావుల్లో నీరు అడుగంటిన పరిస్థితి నెలకొంది. కాగా బీటలుబారిన నేలల్లో పొట్టకొచ్చిన వరి ఎండ వేడిమికి తట్టుకోలేక ఎండిపోయే స్థితికి చేరుకుంది. అదే విధంగా తలసుంచు వేసిన మొక్క జొన్నకు తగినంత నీరు అందకపోవడంతో ఎండిపోతున్నాయి. దీంతో అన్నదాత కళ్లలో కన్నీరే మిగిలిపోతోంది. ఇదిలాఉండగా మండల వ్యాప్తంగా వరి పంటను 3,906 ఎకరాలలో, మొక్కజొన్న పంటను 4,177 ఎకరాలలో సాగుచేశారు. ఇందులో వందకు పైగా రైతుల పంటలు ఎండిపోగా, మరికొంతమంది రైతుల పంటలు ఎండిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి.

కనికరించని ఎస్సారెస్పీ నీరు

గతేడాది యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా మే మాసం నుంచి చివరి వరకు అధికారులు నీటిని విడుదల చేశారు. కానీ ఈ సీజన్‌లో ఫిబ్రవరి వరకు మాత్రమే నీటిని విడుదలచేసి అనంతరం నిలిపివేశారు. గత సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా నీరు విడుదల చేస్తారనే ఆశతో అన్నదాతలు పంటలు వేసుకుంటే మధ్యలోనే ఎస్సారెస్పీ అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. వెంటనే పంటలకు నీరందించేలా ఎస్సారెస్పీ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

శాయంపేటలో..

శాయంపేట : ఆరుగాలం శ్రమించి సాగుచేసిన వరి పంట గొలుసు వేసి పాల దశలో ఉండగా నీరు అందకపోవడంతో పొలాలు బీటలు బారుతున్నాయి. మరో 25రోజుల్లో చేతికొచ్చే పంటలు పొలాల్లోనే ఎండుతున్నాయి. మండలంలోని వసంతాపూర్ మొద్దుల చెరువు కింద 200 ఎకరాలు ఆయకట్టు సాగవుతుండగా, రబీ సీజన్లో 100 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పంట గొలుసులు వేసి పాల దశకు చేరుకున్నాయి. చెరువులో నీరు పూర్తిగా అడుగంటి పోవడంతో సాగుచేసిన వరి రైతుల కళ్లముందే పూర్తిగా ఎండిపోతోంది. వ్యవసాయ బావులు, బోర్లలో నీరు అడుగంటిపోవడంతో రైతులు పంటలను కాపాడలేకపోతున్నారు. పంటసాగుకు ఎకరాకు రూ. 30వేలు ఖర్చు అయ్యిందని, కనీసం పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి దాపురించిందని రైతులు కన్నీళ్లు పెడుతున్నారు. నాలుగు తడుల నీరు అందించినట్లయితే మరో 25రోజుల్లో పంట చేతికొస్తుందని, నీరులేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొద్దుల చెరువులో నీరు అడుగంటి పోవడంతో సాగునీరు అందక పంట పూర్తిగా ఎండిపోగా ఆవులను మేపుతున్నట్లు రైతు ముక్కెర సుధాకర్ తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వకు తూము ఏర్పాటు చేయాలి

డీబీఎం 38 ఎస్సారెస్పీ కాల్వ ద్వారా మండలంలోని సూర్యనాయక్‌తండా, గంగిరేణిగూడెం, వసంతాపూర్ గ్రామాల్లోని చెరువులకు నీరు అందుతుందని, తూము లేకపోవడంతో ఎస్సారెస్పీ కాల్వ నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. గాంధీనగర్ వద్ద ఎస్సారెస్పీ కాల్వకు తూము ఏర్పాటు చేసినట్లయితే మూడు గ్రామాల చెరువులకు నీరు సంమృద్ధిగా చేరుతుందని రైతులు తెలుపుతున్నారు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి సాగునీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.



దామెరలో ఎండిన వరి



దామెర : ల్యాదెళ్లలో ఎండిన మొక్కజొన్న



దామెర సమీపంలో నీరులేని ఎస్సారెస్పీ కెనాల్

ప్రభుత్వం ఆదుకోవాలి



దామెర పొలిమేరల్లోని కర్లాల కుంట సమీపంలో నాకున్న 1.30 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. గత సంవత్సరం మాదిరిగా కుంట ఎండిపోకుండా సరిపడా నీటిపారకంతో పంట సాగుచేసుకోవచ్చని అనుకున్నాను. కానీ ఈ సంవత్సరం కుంట పూర్తిగా ఎండిపోయింది. నీళ్ల లేకపోవడంతో వరిపంట పూర్తిగా ఎండిపోయింది. చేతికొచ్చిన పంట పశువుల మేతకు వదిలేశాను. నా కుటుంబానికి వ్యవసాయమే దిక్కు. ప్రభుత్వం పంటనష్టాన్ని గుర్తించి పరిహారం చెల్లించాలి.

\- గోనెల రమేశ్, రైతు, దామెర

రూ. 50వేల పరిహారం చెల్లించాలి



నాకున్న ఎకరం భూమితో పాటు మరో మూడు ఎకరాల భూమిని ఎకరాకు రూ. 15వేల చొప్పున కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. పంట ఏపుగా ఎదిగి గొలుసులు వేసి పాల దశకు చేరుకుంది. చెరువులో నీరు అడుగంటిపోవడంతో సాగునీరు లేక పంట ఎండిపోయింది. ప్రభుత్వం పంటనష్టంపై రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో విచారణ జరిపించి ఎకరాకు రూ. 50వేలు పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

\- ముక్కెర విజయ్, రైతు, శాయంపేట

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం నుంచి నీటిని గత కొన్ని రోజుల క్రితం నిలిపివేశారు. అప్పటి నుంచి పంటలకు కావాల్సిన నీటి కోసం రైతులు అభ్యర్థిస్తున్నారు. వారి అభ్యర్థనను పరిగణంలోకి తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. పంటలు ఎండిపోతున్న విషయాన్ని తెలుపుతాం. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు సంయమనం పాటించాలి. పంటలకు నీరు అందించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటాం. గత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి.

\- అబ్దుల్ ఖాదర్, ఎస్సారెస్పీ డీఈ

ఉత్తీర్ణత అంతంతమాత్రమే..

విద్యారణ్యపురి : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాల్లో హనుమకొండ జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఒక ఒకేషనల్ కళాశాల తప్పితే మిగితా కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం అంతంత మాత్రంగానే రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్) జనరల్ విభాగంలో 18.13, ప్రభుత్వ పింగిళి ఉమెన్స్ కళాశాలలో 35.1, కమలాపూర్ కళాశాలలో 33.33, హసన్‌పర్తి కళాశాలలో 29.87, ధర్మసాగర్‌లో 34.97, ఆత్మకూరు కళాశాలలో 37.5, పరకాల కళాశాలలో 4శాతం, శాయంపేట కళాశాలలో 12.5, హనుమకొండలోని ఒకేషనల్ కళాశాలలో 60.42 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆయా 9 కళాశాలల్లో ఇంటర్ జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో 1,714 మందికి 603మంది ఉత్తీర్ణత సాధించారు.

సెకండియర్ జనరల్‌లో 32శాతమే..

హనుమకొండ జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ సెకండియర్ జనరల్ విభాగంలో 32శాతం, ఆయా కళాశాలల్లోని ఒకేషనల్ కోర్సుల్లో 72శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఆయా కళాశాలలో జనరల్, ఒకేషనల్ కలిపి 1,969 మందికి 874 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 28.53శాతం, పరకాల కళాశాలలో 12.5శాతం, శాయంపేట కళాశాలలో 26.32శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో నారసింహుడికి, గర్భాలయంలోని శ్రీలక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాలు, పండ్ల రసాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కై కర్యాలు అనంతరం ధ్రువ మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తు అభిషేకం జరిపించారు. అనంతరం లక్ష్మి-నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి-వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు మాస కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం వేదోక్తంగా జరిపించారు. నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్రహారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ రాణి, మాజీ సర్పంచ్ కంజర్ల రమేశ్, గుండపు సత్యనారాయణ-ఉమారాణి దంపతులు అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మే 3న సర్వసభ్య సమావేశం

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మే 3న ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు నివేదికలతో రావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

పంచాయతీరాజ్ దినోత్సవం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేశారు.